www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

బుధవారం, 03-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :34 Issue : 34 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్యకు ఫుల్ స్టాప్..



3



8

## వ్యక్తిగత విషయాలపై రూమర్స్ పరోక్షంగా స్పందించిన త్రిష

## పుష్కర తెలంగాణ.. ముష్కరుల తెలంగాణగా మారింది: కేటీఆర్

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను గుర్తు చేసిన కేటీఆర్
- అభివృద్ధి రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నారని ఆరోపణ
- గ్యారంటీల పాలనతో వ్యవస్థలు దెబ్బతింటున్నాయని వ్యాఖ్య
- 2028లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్న ధీమా

3



# తెలంగాణ రైజింగ్-2047.. ప్రపంచానికి గేట్‌వేగా తెలంగాణ



ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ దిశానిర్దేశం

2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

రైతు, మహిళ, యువత సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

సామాజిక న్యాయం, ఉద్యోగాల భర్తీపై ప్రత్యేక దృష్టి

అభివృద్ధి–సంక్షేమంతో తెలంగాణకు కొత్త గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణను ప్రపంచ స్థాయి ఆర్థిక, పారిశ్రామిక, సేవారంగ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, "తెలంగాణ రైజింగ్-2047" విజన్ ద్వారా రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించిన సీఎం, వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ప్రభుత్వ బాధ్యత అని

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణ మీ అయ్య జాగీరా..?: పవన్ కల్యాణ్

- తెలంగాణ ప్రజల సమస్యలపై మాట్లాడే హక్కు జనసేనకు ఉంది
- బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదన్న పవన్
- భూకబ్జా ఆరోపణలపై విచారణకు సిద్ధమని సవాల్
- తెలంగాణలో జనసేనను మరింత బలోపేతం చేస్తామని వెల్లడి

**హైదరాబాద్, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణలో ప్రజల సమస్యలపై స్పందించడం జనసేన పార్టీ బాధ్యత అని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, ప్రజా సమస్యలపై మాట్లాడే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణ మా అయ్యా జాగిరే: పొన్నం ప్రభాకర్

- పవన్ కళ్యాణ్‌పై మంత్రి ఘాటు విమర్శలు
- గద్దర్‌పై వ్యాఖ్యలు బాధాకరమని ఆగ్రహం
- తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిస్తే ఊరుకోమని హెచ్చరిక
- పెయిడ్ ఆర్టిస్ట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

2



## జర్నలిస్టులకు ఇళ్లు.. ఆరోగ్యశ్రీకి నెలకు రూ.150 కోట్లు

మీడియా సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉంది

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 10 వేల కొత్త బెడ్‌లు

రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగిస్తామని స్పష్టీకరణ

2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యర్థులే లేరన్న భట్టి

ధాన్యం కొనుగోళ్లపై బీజేపీపై విమర్శలు

**ఖమ్మం, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల కేటాయింపు అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం

మిగతా 2వ పేజీలో..



## ఈవేలంతో రూ.202 కోట్ల ఆదా

- మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్‌కు భారీ లాభం
- కొత్త విధానంతో రాష్ట్ర ఖజానాకు అదనపు ఆదా
- 3.80 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వల విక్రయం పూర్తి
- గోదాములు ఖాళీ చేసి యాసంగి పంటలకు సిద్ధం



**హైదరాబాద్, జూన్ 3, ఆశ్వి అప్డేట్స్:** మార్క్‌ఫెడ్ ద్వారా నిల్వ ఉన్న మొక్కజొన్నను వినూత్న ఈవేలం విధానంలో విక్రయించడం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.202.56 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వానాకాలం సీజన్‌లో సేకరించిన 3,80,187 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలను కొత్త విధానంలో విక్రయించడం

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణ బాగుపడాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి

కాళేశ్వరం అంశంపై సీఎం వ్యాఖ్యలపై విమర్శలు

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనుకబడుతోందని ఆరోపణ


తెలంగాణ ఏర్పాటులో బీజేపీ పాత్ర కీలకమని వ్యాఖ్య

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శ

కేంద్ర నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్న బండి



3



## నైరుతి రాక ఆలస్యం


- కేరళా తీరాన్ని తాకి మందగించిన రుతుపవనాల కదలికలు

3

## ఓటరు జాబితా ప్రక్షాళనకు వేగం

- ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు
- రాజకీయ పార్టీలతో సమన్వయం పెంచాలని సూచన

3







## కొలువుల జాతర షురూ

- 290 ఇంజినీరింగ్ పోస్టులకు TGPSC నోటిఫికేషన్లు

2



## 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ మీ అయ్య జాగీరా..?: పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి**

ఉంటుందని అన్నారు.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ ఆవిర్భావం హైదరాబాద్‌లోనే జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు ఉన్నందున రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై స్పందించడం సహజమేనన్నారు. తెలంగాణపై తమకు ఇప్పుడే ఆసక్తి కలగలేదని, మొదటి నుంచి రాష్ట్ర ప్రజలతో అనుబంధం కొనసాగుతోందని చెప్పారు.
తాను తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నానని పవన్ తెలిపారు. ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో తిరిగిన అనుభవం తనకు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం విమర్శలు చేస్తున్న కొందరు నాయకులు అప్పట్లో ఆ ప్రాంతాల గురించి పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు.
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తాను వ్యతిరేకించలేదని, రాష్ట్ర విభజన జరిగిన విధానంపై మాత్రమే తనకు అభ్యంతరాలు ఉన్నాయని పవన్ స్పష్టం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, రెండు రాష్ట్రాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి ముందుకు సాగాలని అన్నారు.
తనపై వస్తున్న విమర్శలు, హెచ్చరికలను ప్రస్తావిస్తూ, బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కాదన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తిగా ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటానని చెప్పారు. భూకబ్జాలకు సంబంధించిన ఆరోపణలపై స్పందిస్తూ, తనపై వచ్చిన ప్రతి ఆరోపణను విచారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూములు లేదా చెరువులను ఆక్రమించినట్లు నిరూపితమైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని సవాల్ విసిరారు. గద్దర్ గురించి మాట్లాడుతూ, ఆయనకు అవసరమైన సమయంలో తాను సహాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గద్దర్ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో తనవంతు సహకారం అందించానని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో జనసేన క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజా సమస్యలపై స్వరం వినిపిస్తానని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

## తెలంగాణ మా అయ్యా జాగిరే: పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్:**
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అవమానించేలా చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీస్తాయని విమర్శించారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు పోరాడారని, అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని మంత్రి గుర్తు చేశారు. అలాంటి ఉద్యమ చరిత్రను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమం గురించి పవన్ కళ్యాణ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు.
ఉద్యమ కవి, ప్రజాగాయకుడు గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను ఎవరూ తక్కువ చేసి చూడలేరన్నారు. గద్దర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిపై పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించిన మంత్రి, ప్రజల సొమ్ముతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వ్యక్తిగత ఆస్తులుగా చిత్రీకరించడం సరికాదన్నారు. తెలంగాణ అభివృద్ధిపై అనవసర వ్యాఖ్యలు చేయడం కంటే వాస్తవాలను గుర్తించాలని సూచించారు. తెలంగాణకు వచ్చిన అతిథిగా పవన్ కళ్యాణ్‌కు గౌరవం ఇచ్చామని, అయితే రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ప్రజలు సహించరని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎవరు వచ్చినా స్వాగతమే కానీ రాష్ట్ర అస్తిత్వాన్ని కించపరిచే ప్రయత్నాలను అంగీకరించబోమన్నారు. పవన్ కళ్యాణ్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన మంత్రి, ఆయన రాజకీయ వ్యాఖ్యల వెనుక ఎవరి స్క్రిప్ట్ ఉందో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమం, గద్దర్ వంటి వ్యక్తుల గురించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు.

## 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

**మొదటిపేజీ తరువాయి**

ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసిందని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. ఆ ఖైదీలు మంగళవారం జైళ్ల నుంచి విడుదలయ్యారని తెలిపారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి మంగళవారం నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల పొందిన వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.





# తెలంగాణ రైజింగ్-2047.. ప్రపంచానికి గేట్‌వేగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని హక్కుగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు.
వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదిగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతుల రుణభారం తగ్గించేందుకు భారీ స్థాయిలో రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా ద్వారా నేరుగా ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.
మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని సీఎం తెలిపారు. వివిధ పోటీ పరీక్షల ద్వారా వేలాది ఖాళీలను భర్తీ చేశామని, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.
విద్యా రంగంలో నాణ్యత పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయాలు, ఆధునిక విద్యా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.
పేదలకు గృహ వసతి కల్పనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా కుల గణన సర్వే నిర్వహించడంతో పాటు బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ ఉపవర్గీకరణ అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు.
ఆరోగ్య రంగంలో భారీ పెట్టుబడులు పెట్టి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని సీఎం చెప్పారు. కొత్త మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల నిర్మాణం, ఆరోగ్యశ్రీ పరిధి విస్తరణ వంటి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను వివరిస్తూ, తెలంగాణను మూడు ప్రధాన అభివృద్ధి మండలాలుగా రూపొందించే ప్రణాళికను సీఎం వెల్లడించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సేవారంగ కేంద్రంగా, రింగ్ రోడ్ల మధ్య ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల హబ్‌గా, మిగతా జిల్లాలను వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.
2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను దేశానికే కాకుండా ప్రపంచానికి గేట్‌వేగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ప్రయాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పిలుపునిచ్చారు.




# కొలువుల జాతర షురూ

- 290 ఇంజనీరింగ్ పోస్టులకు TGPSC నోటిఫికేషన్లు
- ఆర్అండ్‌బీ శాఖలో 271 AEE ఖాళీలు
- కాలుష్య నియంత్రణ మండలిలో 19 పోస్టులు
- జూన్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నిరుద్యోగ ఇంజనీర్లకు భారీ అవకాశం




**హైదరాబాద్, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్:**
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఇంజనీరింగ్ అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) శుభవార్త అందించింది. రాష్ట్రంలోని పలు శాఖల్లో ఖాళీగా ఉన్న 290 ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది.
ఈ నియామకాల్లో అత్యధిక పోస్టులు రోడ్లు, భవనాల శాఖలో ఉన్నాయి. సివిల్ విభాగంలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (AEE) పోస్టులు, ఎలక్ట్రికల్ విభాగంలో 49 AEE పోస్టులను భర్తీ చేయనున్నారు. దీంతో ఆర్అండ్‌బీ శాఖలో మొత్తం 271 ఖాళీలను భర్తీ చేసే అవకాశం కల్పించారు.
అదే సమయంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి కూడా ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మూడు నోటిఫికేషన్లతో కలిపి మొత్తం 290 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.
అభ్యర్థుల వయస్సు ఈ ఏడాది జూలై 1 నాటికి 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను విడతలవారీగా నిర్వహించనున్నారు. సివిల్ AEE పోస్టులకు జూన్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై జూలై 13 వరకు కొనసాగుతుంది. ఎలక్ట్రికల్ AEE పోస్టులకు జూన్ 8 నుంచి జూలై 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. కాలుష్య నియంత్రణ మండలిలోని అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూన్ 10 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై జూలై 17తో ముగుస్తుంది.
అర్హత కలిగిన అభ్యర్థులు TGPSC అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్హతలు, పరీక్షా విధానం, సిలబస్, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను నోటిఫికేషన్లలో పరిశీలించాలని కమిషన్ సూచించింది.
ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో విడుదలైన ఈ నోటిఫికేషన్లు ఇంజనీరింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు కీలక అవకాశంగా మారనున్నాయి.



## నైరుతి రాక ఆలస్యం

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్ :**
దేశంలో నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యం కానుంది. కేరళ తీరాన్ని తాకడంలో రుతుపవనాల కదలికలు మందగించడమే అందుకు కారణమని తెలుస్తోంది. భారత వాతావరణ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం జూన్ ప్రారంభంలోనే దేశంలోకి ప్రవేశించాల్సిన రుతుపవనాలు మరో 3 నుంచి 4 రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తాజాగా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జూన్ 5, 6 తేదీల్లో నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఈ నెల ఒకటో తేది నాటికే కేరళను తాకాల్సిన ఈ రుతుపవనాలు, ఈసారి కదలికలు మందగించడంతో ఆలస్యంగా రానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న అసాధారణ వాతావరణ మార్పులు, వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ నైరుతి రుతుపవనాల రాకకు అడ్డంకిగా మారినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఆ వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావం పూర్తిగా తొలగిపోతే గానీ రుతుపవనాల కదలికలు వేగవంతం కదలవని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రుతుపవనాల రాక ఆలస్యం కానుండటంతో దేశంలోని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని రైతాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సీజన్ పనుల కోసం వర్షాలపైనే ఆధారపడే రైతులు.. విత్తనాలు వేసే సమయం దాటిపోతుండటంతో ఆకాశం వైపునకు చూస్తున్నారు.

# మంగ్లీపై సోషల్ మీడియాలో కొత్త వివాదం

**హైదరాబాద్, జూన్ 3, ఆశ్వి అప్డేట్స్:**
జానపద గాయని మంగ్లీ మరోసారి సోషల్ మీడియాలో విమర్శల కేంద్రంగా మారారు. గతంలో నిర్వహించిన ఓ సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాడిన 'బండెనుక బండి గట్టి.. పదహారు బండ్లు గట్టి' పాటకు సంబంధించిన వీడియో తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మళ్లీ వైరల్ అవుతోంది.
తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం పొందిన ఈ పాటను గూడ అంజయ్య రచించారు. నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ గీతాన్ని ప్రదర్శించిన తీరుపై కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాటలోని భావోద్వేగం, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వినోదాత్మక శైలిలో ప్రదర్శించారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా వేదికపై చేసిన నృత్య ప్రదర్శన, పాటను ఆలపించిన విధానం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికే పలు వివాదాలతో వార్తల్లో నిలిచిన మంగ్లీపై ఈ అంశం కూడా చర్చకు దారితీసింది.
తెలంగాణ ఉద్యమ చరిత్రకు సంబంధించిన పాటలను ప్రదర్శించే సమయంలో మరింత బాధ్యతతో వ్యవహరించాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ వివాదంపై మంగ్లీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రం ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, కొందరు ఆమెకు మద్దతు తెలుపుతుండగా మరికొందరు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# జర్నలిస్టులకు ఇళ్లు.. ఆరోగ్యశ్రీకి నెలకు రూ.150 కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

కోసం అధికార యంత్రాంగం పనిచేస్తోందని వెల్లడించారు.
ఖమ్మంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన భట్టి విక్రమార్క, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ పథకం నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెలా సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.
ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అదనంగా 10 వేల పడకలను ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
రాష్ట్ర మంత్రివర్గం సమష్టిగా పనిచేస్తోందని, తెలంగాణ అభివృద్ధే అందరి లక్ష్యమని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ఇదే విశ్వాసం కొనసాగితే 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి ప్రత్యర్థులు ఉండరని ధీమా వ్యక్తం చేశారు.
రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి స్పష్టం చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేసే ఆలోచన లేదని తెలిపారు. రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదన్నారు.
ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించిన భట్టి, ఓటర్ల మ్యాపింగ్, అన్‌మ్యాపింగ్ అంశాలను మీడియా నిశితంగా గమనించాలని కోరారు. ప్రభుత్వం తీసుకురానున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రజలకు మరింత భరోసా కల్పిస్తుందని చెప్పారు.
ధాన్యం కొనుగోళ్ల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన భట్టి విక్రమార్క, రైతుల ప్రయోజనాల విషయంలో బీజేపీ స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, కేంద్రం ద్వారా రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకునే దిశగా పనిచేయాలని సూచించారు.





# పుష్కర తెలంగాణ.. ముష్కరుల తెలంగాణగా మారింది: కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రస్తావించిన కేటీఆర్, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన కృషిని గుర్తు చేశారు. ఉద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం నింపేందుకు కేసీఆర్ అనేక రూపాల్లో పోరాటం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేక సవాళ్లను అధిగమించి సాధించిన విజయమని చెప్పారు.

రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, "పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారింది" అని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశయాలతో ఏర్పడిన రాష్ట్రం అభివృద్ధి పథం నుంచి తప్పిపోతోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ చేసిన సేవలను ఉద్దేశపూర్వకంగా మరుగునపరుస్తున్నారని అన్నారు.

నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం, తాగునీటి సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన పురోగతిని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

రాజకీయ పరిస్థితులపై స్పందించిన కేటీఆర్, గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసి విజయాలు సాధించిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలతో అధికారంలోకి వచ్చినప్పటికీ వాటి అమలులో విఫలమవుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పరిపాలనా వ్యవస్థలు బలహీనపడుతున్నాయని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో వెనుకడుగు వేస్తోందని పేర్కొన్న కేటీఆర్, ప్రస్తుత పరిస్థితులు శాశ్వతం కాదన్నారు. 2028 ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారని, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం అమలు

**హైదరాబాద్, జూన్ 3, ఆశ్వి అప్డేట్స్:**

న్యాయవాదుల భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం-2026' రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు న్యాయశాఖ జీవో ఎంఎస్ నెం.41 ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

న్యాయవాదులు తమ విధులను ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వర్తించేందుకు ఈ చట్టాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. లాయర్లతో పాటు వారి కుటుంబ సభ్యుల భద్రతకు కూడా ఇందులో ప్రత్యేక నిబంధనలు కల్పించారు.

ఈ చట్టంలోని కీలక అంశం న్యాయవాదుల అరెస్టులకు సంబంధించినది. ఇకపై ఏ న్యాయవాదినైనా అరెస్టు చేయాలంటే సంబంధిత న్యాయస్థానం అనుమతి తప్పనిసరి. కోర్టు అనుమతి లేకుండా అరెస్టు చేసే అవకాశం ఉండదు. దీంతో అక్రమ అరెస్టులు, వేధింపులు, కక్షసాధింపు చర్యలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

న్యాయవాదులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేసిన వారిపై కూడా కఠిన చర్యలకు చట్టంలో అవకాశం కల్పించారు. అలాంటి కేసుల్లో మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు.

న్యాయవాదులు లేదా వారి కుటుంబ సభ్యులపై దాడులు, బెదిరింపులు, దుర్భాషలాడటం వంటి చర్యలను కూడా తీవ్రమైన నేరాలుగా పరిగణించనున్నారు. మొదటిసారి నేరం రుజువైతే ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు. అదే నేరం మళ్లీ చేస్తే ఒకటి నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.న్యాయవాదులకు ప్రాణహాని ఉందని భావించిన సందర్భాల్లో ప్రభుత్వం తక్షణమే పోలీసు భద్రత కల్పించనుంది. అలాగే వారి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గతంలో న్యాయవాద దంపతులు వామన్‌రావు, నాగమణి హత్య ఘటన తర్వాత న్యాయవాదుల భద్రతపై విస్తృత చర్చ జరిగింది. బార్ కౌన్సిల్, న్యాయవాద సంఘాల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన ఈ చట్టం ద్వారా న్యాయవాదుల భద్రతకు మరింత భరోసా లభించనుంది.

# ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణ సమస్యకు ఫుల్ స్టాప్..

**ఆంధ్రప్రదేశ్, ఆశ్వి అప్డేట్స్**

జిల్లాల్లో సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లా స్థాయిలో ఎంత వరకు చేయగలరో చేయాలని... జిల్లా స్థాయిలో క్రమబద్దీకరణ కుదరని పక్షంలో కేబినెట్‌కు తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. "రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణ సమస్య చాలా కాలంగా పెండింగులో ఉందన్నారు సీఎం చంద్రబాబు... ఏదో ఒక రకమైన సాకు చూపి వాటిని పెండింగులో పెట్టేస్తున్నారన్నారు.. దీనికి ఫుల్ స్టాప్ పెట్టాలన్నారు. ప్రతీ జిల్లాలో క్రమబద్దీకరించాల్సిన ఇళ్లు, ఇళ్ల స్థలాల జాబితాను సిద్ధం చేయాలి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోండి. క్రమబద్దీకరణకు సంబంధించి జిల్లాల స్థాయిలో ఎంత వరకు చేయగలిగితే.. ఆ మేరకు చేసేయాలి. అక్కడ సమస్య పరిష్కారం కాకుంటే... కేబినెట్లో పెట్టి వాటి క్రమబద్దీకరణకు నిర్ణయం తీసుకుంటాం. ఎటువంటి వివాదాలు లేకుండా క్రమబద్దీకరించ దగ్గ స్థలాలను ప్రతీ కేబినెట్‌కు తీసుకురావాలి. అప్పటికీ పూర్తి కానివి ఏమైనా ఉంటే... ఆ సమస్యను ఏ విధంగా పరిష్కరించేలా ఆలోచన చేద్దాం. ఇక గృహ నిర్మాణ శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా మొదలు పెట్టాలి. ఈ మేరకు గృహ నిర్మాణం - ఆర్థిక శాఖలు సమన్వయం చేసుకోవాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**రాజవొమ్మంగి సీడీపీవో ఆత్మహత్య కారకులపై కఠిన చర్యలు**

"ఇసుక అక్రమాలు అస్సలు జరగడానికి వీల్లేదు. ఏపీలో తవ్విన ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు. రాష్ట్రాల సరిహద్దులు దాటిన వాహనాలను సీజ్ చేయండి.. ఈ విషయంలో కఠినంగా ఉండండి. ఇసుక లారీలను ట్రాకింగ్ పెట్టాలి. ఈ మేరకు టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. ఇసుక అక్రమంగా వేరే ప్రాంతాలకు వెళ్తే... వెంటనే అలర్ట్ మెసేజ్ వచ్చేలా మెకానిజం ఉండాలి. ఇప్పటికే 50 వేల వాహనాలకు జీపీఎస్ పెట్టి ట్రాకింగ్ చేస్తున్నాం.. అక్రమాలు జరగడానికి వీల్లేదు. ఈ మేరకు మైనింగ్‌పోలీసులు కోఆర్డినేట్ చేసుకోవాలి. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ప్రభుత్వం అందించే ప్రతీ పథకం, అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కలిగితే.. ప్రభుత్వం అందించే సేవలకు సార్థకత లభిస్తుంది. ప్రజల్లోకి వెళ్లాలని... ప్రజలకు వివరించాలని చెప్పేది ప్రచారం కోసం కాదు... ప్రజల

# ఓటరు జాబితా ప్రక్షాళనకు వేగం

- రాష్ట్రంలో 68.30 శాతం మ్యాపింగ్ పూర్తి
- ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు
- రాజకీయ పార్టీలతో సమన్వయం పెంచాలని సూచన
- ఆన్‌లైన్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఈసీఐ సూచన
- హైదరాబాద్‌లో ఎన్నికల సంఘం సమీక్ష సమావేశం

**హైదరాబాద్, జూన్ 3, ఆశ్వి అప్డేట్స్:**



దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో మూడో దశ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం అధికారులకు సూచించింది.

హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు అవినాష్ కుమార్, సంజయ్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న చర్యలను వివరించారు.

ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 68.30 శాతం మ్యాపింగ్ పూర్తయిందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బంది నియామకం, సహాయ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలపై వివరించారు.

ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. రాజ్యాంగ నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టం1950, ఓటర్ల నమోదు నియమాలు 1960కు సంబంధించిన అంశాలను వివరించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, తుది జాబితా విడుదల వరకు అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. గణన ఫారాల నింపడంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచించారు. అలాగే ఓటర్లు అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే అవకాశంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. 'బుక్ ఎ కాల్' సదుపాయం ద్వారా ఓటర్లకు సమాచారం చేరవేయాలని సూచించారు.

జిల్లా ఎన్నికల అధికారులు అన్ని రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, బూత్ లెవల్ ఏజెంట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, మేడ్చల్ కలెక్టర్ ఎం. మనూ చౌదరి తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు లేవనెత్తిన సాంకేతిక, పరిపాలనా అంశాలపై ఎన్నికల సంఘం అధికారులు వివరణలు ఇచ్చారు.

# ఈ-వేలంతో రూ.202 కోట్ల ఆదా

**మొదటిపేజీ తరువాయి**

ద్వారా మెరుగైన ధరలు లభించాయని వెల్లడించారు. యాసంగి పంటల కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో గోదాముల్లో నిల్వ ఉన్న ఖరీఫ్ మొక్కజొన్నను నెల రోజుల్లో పూర్తిగా తరలించాలని ప్రభుత్వం హెచ్1 బిడ్డర్లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో సుమారు 3.80 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వచ్చి, కొత్తగా కొనుగోలు చేస్తున్న పంటల నిల్వకు ఉపయోగపడుతుందని చెప్పారు.గతంలో గోదాముల వారీగా ఈటెండర్లు నిర్వహించే విధానం అమల్లో ఉండేదని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన టెండర్లలో ఆశించిన ధరలు రాకపోవడంతో వాటిని ఆమోదించలేదన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రభుత్వ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త ఈవేలం విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు.దేశవ్యాప్తంగా మరింత మంది వ్యాపారులు పాల్గొనేలా రూపొందించిన ఈ విధానానికి మంచి స్పందన లభించిందన్నారు. మే 29న నిర్వహించిన ఈవేలంలో తీవ్ర పోటీ నెలకొనడంతో మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,337 ధర లభించిందని తెలిపారు. ఇది గత టెండర్లతో పోలిస్తే టన్నుకు రూ.5,327 అధికమని చెప్పారు.రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోళ్లు చేపడుతోందని తుమ్మల పేర్కొన్నారు. కొనుగోలు, రవాణా, నిల్వ, నిర్వహణ ఖర్చులను భరిస్తూనే రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు.ఇదే సందర్భంగా మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామక ప్రక్రియపై కూడా మంత్రి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఎనుమాముల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్‌పర్సన్‌గా బండి జనార్ధన్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 191 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించామని వెల్లడించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, మార్కెట్ యార్డుల్లో పారదర్శకత పెంచడం, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# సంగారెడ్డిలో అంతర్రాష్ట్ర డ్రగ్స్ తయారీ కేంద్రం బట్టబయలు

**సంగారెడ్డి, జూన్ 3, ఆశ్వి అప్డేట్స్:**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అంతర్రాష్ట్ర డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని మహారాష్ట్ర పోలీసులు ఛేదించారు. మండల పరిధిలోని పీచేర్యాగడి తండాలో ఉన్న రెండు ఫామ్‌హౌస్‌లలో అక్రమంగా డ్రగ్స్ తయారీ జరుగుతున్నట్లు గుర్తించి ప్రత్యేక బృందం దాడులు నిర్వహించింది. పక్కా సమాచారంతో ముంబై నుంచి వచ్చిన పోలీసు బృందం ఫామ్‌హౌస్‌లపై మెరుపు దాడి చేయగా, అక్కడ ల్యాబ్ తరహా ఏర్పాట్లు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు బయటపడింది. తనిఖీల సందర్భంగా సుమారు మూడు కిలోల మెఫెడ్రోన్ డ్రగ్స్‌తో పాటు, వాటి తయారీకి ఉపయోగించే భారీ మొత్తంలో ముడి పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ముడి పదార్థాల విలువ సుమారు రూ.6.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాథమిక విచారణలో డ్రగ్స్ తయారీకి అవసరమైన రసాయనాలను ముంబై నుంచి రహస్యంగా తరలించినట్లు తేలింది. నగర ప్రాంతాల్లో నిఘా ఎక్కువగా ఉండటంతో నిందితులు సంగారెడ్డి గ్రామీణ ప్రాంతంలోని ఫామ్‌హౌస్‌ను కేంద్రంగా ఎంచుకుని అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడ తయారు చేసిన డ్రగ్స్‌ను ముంబైతో పాటు ఇతర ప్రధాన నగరాలకు సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు.

# లబ్ధిదారుల కల సాకారం

- గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి
- ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ
- వరంగల్ అభివృద్ధికి కట్టుబాటు

**హనుమకొండ, జూన్ 2, ఆశ్వి అప్డేట్స్**





తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లాలో పేదల గృహ కలలను సాకారం చేసే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాయంపేటలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొని వారికి ఆత్మీయ కానుకలు అందజేశారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయిన సుమారు 608 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను ప్రజా ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మరమ్మతులు చేపట్టి నివాసయోగ్యంగా మార్చిందని మంత్రి తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరిందన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో పేదల సమస్యలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్లు రాని వారు ఎవరూ అధైర్యపడవద్దని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో హైదరాబాద్ తరహాలో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ భూములను గుర్తించి పెద్ద ఎత్తున గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# తెలంగాణ బాగుపడాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి: బండి సంజయ్

**హైదరాబాద్, జూన్ 3, ఆశ్వి అప్డేట్స్:**



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. అవసరమైతే తాను, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కలిసి మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశానికి సమన్వయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

బీజేపీ రాష్ట్రకార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి సంజయ్, అనంతరం ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఉద్యమ ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం గందరగోళం, అవినీతి, కమిషన్ల పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో బీజేపీ కీలక పాత్ర పోషించిందని బండి సంజయ్ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

ధాన్యం కొనుగోళ్ల అంశంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రాష్ట్రం పంపిన నివేదికల ఆధారంగానే కేంద్రం ధాన్యం సేకరణ చేపడుతోందని తెలిపారు. రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర నిధులు కీలకమని పేర్కొన్న బండి సంజయ్, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మరింత పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరమని, అదే తెలంగాణ పురోగతికి దోహదపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





**ఆశ్వ అప్డేట్స్**

జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా ఆధ్వర్యంలో బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్లాపూర్ గ్రామంలో పోలీసులు ముమ్మర దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాటు సారా తయారీ ముడి పదార్థాలను (ఐడీ లిక్కర్ రా మెటీరియల్) భారీగా స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రాథోడ్ రత్న్యా నాయక్ (56) వద్ద నుండి రూ. 12,000 విలువైన 80 లీటర్ల ముడి పదార్థం, రూ. 5,250 విలువైన 15 కిలోల నవసాగరాన్ని (మొత్తం విలువ రూ. 17,250) టాస్క్ ఫోర్స్ బృందం సీజ్ చేసింది. అదేవిధంగా, కొత్లాపూర్ గ్రామానికే చెందిన బాల్యా నాయక్ (38) నివాసంపై దాడి చేసి, అతని వద్ద నుండి రూ. 22,500 విలువైన 150 లీటర్ల ముడి పదార్థం, రూ. 350 విలువైన ఒక కిలో నవసాగరాన్ని (మొత్తం విలువ రూ. 22,850) స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్లా కలిపి మొత్తం రూ. 40,100 విలువైన సారా ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీజ్ చేసిన సామాగ్రిని, నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా తెలిపారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో ఇలాంటి అక్రమ వ్యాపారాలు, నాటు సారా తయారీపై మా దాడులు నిరంతరం కొనసాగుతాయి, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు అని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ తెలిపారు.





## తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ..

- **జిల్లా ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు -జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీస్..**

**ఆశ్వ అప్డేట్స్**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ IPS జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

అనంతరం పోలీస్ అధికారులతో కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులు, విద్యార్థులు, అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలన అందించడంలో సమిష్టిగా పనిచేయాలని అధికారులకు తెలిపారు.

ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఎస్పీ, జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు, శివరాం రెడ్డి, రవి కుమార్, శ్రీనివాసులు,సీఐలు,ఆర్.ఐ లు,ఎస్సైలు, మినిస్టీరియల్ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, తెలంగాణ సాధించిన ప్రగతిని, భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,ఐపిఎస్ , పరిగి శాసనసభ్యులు శ్రీ రామ్ మోహన్ రెడ్డి , తాండూర్ శాసనసభ్యులు శ్రీ మనోహర్ రెడ్డి , ఇతర ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ముఖ్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లు ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న షీ టీమ్స్ (She Teams), బాధితులకు అండగా నిలిచే భరోసా కేంద్రం స్టాల్, ఐటీ విభాగానికి చెందిన ఐటీసీటీ (ITCT) స్టాల్, డీఏఆర్ (DAR) స్టాళ్లతో పాటు క్లూస్ టీమ్ (Clues Team) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఫోరెన్సిక్ వాహన ప్రదర్శన సందర్శకులను విశేషంగా



అలరించాయి. అలాగే పోలీస్ విభాగం ప్రదర్శించిన డాగ్ స్క్వాడ్ షో మరియు డాగ్ హర్డిల్స్ (దాటుడు ప్రదర్శనలు) వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమ ముగింపులో భాగంగా, జిల్లా పోలీస్ శాఖలో తమ విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది ప్రతిభావంతులైన పోలీస్ అధికారులకు స్పీకర్, కలెక్టర్ మరియు ఎస్పీ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి, వారి సేవలను అభినందించారు.




## నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**నల్లగొండ, ఆశ్వ అప్డేట్స్**

నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా, శ్రీమతి సోనియా గాంధీ గారు చూపిన తెగువతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, జూన్ 2 మనందరికీ పండగ రోజని కొనియాడారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్లగొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ ముందుకు సాగదని, మన జిల్లా విప్లవ పోరాటాల పురిటి గడ్డ, సాయుధ పోరాటాల ఖిల్లా అని స్పష్టం చేశారు. నాటి సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, సుద్దాల హనుమంతు, భీమిరెడ్డి నరసింహారెడ్డి లాంటి వీరులు రజాకార్లపై తిరగబడ్డ చరిత్రను స్మరించుకున్నారు. మలిదశ ఉద్యమంలోనూ నల్లగొండ సింహభాగం పాత్ర పోషించిందని, శ్రీకాంతాచారి లాంటి యువకులు ప్రాణత్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేక నాడు స్వరాష్ట్ర సాధన కోసం తాను కూడా మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్నానని గుర్తుచేశారు. ప్రజా పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు, సంక్షేమంలో అగ్రభాగాన నిలబెట్టేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు..

## సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం జాతీయ పతాకాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ . సిబ్బందికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వరాష్ట్ర సాధనలో మహానుభావుల త్యాగాలు కృషి గురించి సిబ్బందికి తెలియజేయడం. సిబ్బంది అందరూ స్ఫూర్తితో ప్రజలకు విలువైన పోలీసు సేవలను వేగవంతంగా అందించాలని కోరారు. డిఎస్పీ ప్రసన్న కుమార్, డిసిఆర్బి డిఎస్పీ రవి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్ఐ లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఎస్ఐ యాకూబ్, జాన్సిరాని, నీలిమ, ఆర్ఎస్ఐ లు సురేష్, సాయి రామ్, అన్వర్, అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు,

# కనిపించినచో ఆచూకీ తెలపగలరు

**జగదేవ్‌పూర్ , ఆశ్వ అప్డేట్స్**

దైవ దర్శనానికి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన సంఘటన జగదేవపూర్ మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చింతల నరసింగారావు, తండ్రి: అంజయ్య, వయస్సు: 63 సంవత్సరాలు, కులం: ముదిరాజ్, నివాసం: దుండిగల్ గ్రామం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గల వ్యక్తి గత మూడు రోజుల క్రితం కొండపోచమ్మ దేవాలయానికి దర్శనార్థం వచ్చి, కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి, కేసు దర్యాప్తును ఎస్.ఐ శ్రీ కృష్ణారెడ్డి చేపట్టారు. మిస్సింగ్ వ్యక్తి ఆచూకీ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి, పరిసర ప్రాంతాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

పై వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే లేదా ఎక్కడైనా కనిపించినట్లయితే



8712667463 - జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్

8712667339 - సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కి సమాచారం అందించవలసిందిగా ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.



# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జగదేవపూర్, ఆశ్వ అప్డేట్స్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం రోజున జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీ కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ స్ఫూర్తి, రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాలు మరియు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన విధానం గురించి సిబ్బందికి వివరించారు. తెలంగాణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## గజ్వేల్ పోలీస్ స్టేషన్ లో ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ

**గజ్వేల్ జున్ 02 (ఆశ్వ అప్డేట్స్)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ పోలీస్ స్టేషన్ లో ఆవరణలో సీఐ రవికుమార్ జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ రవికుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ స్ఫూర్తి, రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాలు మరియు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన విధానం గురించి సిబ్బందికి వివరించారు. తెలంగాణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ ఎస్సైలు ఏఎస్ఐ హెడ్ కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు



## నారాయణపేట కలెక్టరేట్ లో అట్టహాసంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఆశ్వ అప్డేట్:**
**నారాయణపేట జూన్ 2**

నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశువశంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య , క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరై తెలంగాణ అమర వీరులకు ఘన నివాళులు అర్పించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించి సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో



రాజేశ్వరి, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, కలెక్టరేట్ ఏ వో, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు, పోలీసులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**ఆశ్వ అప్డేట్:**
**నారాయణపేట జూన్ 2**

... జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ... బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS జాతీయ జెండాను ఆవిష్కరించి ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం అనేక మంది మహనీయుల త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పడిందని, రాష్ట్ర అభివృద్ధిలో శాంతిభద్రతలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అన్ని రంగాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన వాహనాలు, సౌకర్యాలతో తెలంగాణ పోలీస్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.పోలీసులు తమ విధులను వృత్తి దైవంగా భావించి క్రమశిక్షణతో నిర్వహించాలని, సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సాధారణ ప్రజలకు భరోసా కల్పించాలని సూచించారు. ప్రజలందరికీ ఎలాంటి వివక్ష లేకుండా సమానమైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (డీఏఆర్) ఎం.డి. రియాజ్ హూల్ హక్, డీఎస్పీలు ఎన్. లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, సైదులు, ఆర్ఐ లు నరసింహ, విజయ్ భాస్కర్, ఎస్సైలు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## ప్లాస్టిక్ నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

**ఆశ్వ అప్డేట్:**
**నారాయణపేట జూన్ 2**

నారాయణపేట సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన పోస్టర్ను మంగళవారం జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మంగళవారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా దీన్ని రూపొందించారు. ప్లాస్టిక్ రహిత అడవులు, పర్యాటక ప్రాంతాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత నగరాలుగా మార్చాలని బట్ట సంచులు కాగితపు సంచులలో వస్తువులు తీసుకెళ్లాలని సూచించారు.ఈ

కార్యక్రమంలో ఎస్ఆర్వో కమాలుద్దీన్, పద్మారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు......

# సేవా పతకాలు పొందిన పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 2**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ సేవా పతకాలలో నారాయణపేట జిల్లా పోలీసు శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు.
ఈ సందర్భంగా పతకాలకు ఎంపికైన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పతకాలను ప్రదానం చేయడం సంతోషకరమని పేర్కొన్నారు.

**పతకాలకు ఎంపికైన వారిలో:**
1. ఏ. సైదులు, సర్కిల్ ఇన్స్పెక్టర్, కోస్గి
2. ఏ.బి. సురేందర్ బాబు, ఏఎస్ఐ, కృష్ణ పోలీస్ స్టేషన్
3. ఎం. సాయిబాబా, ఏఎస్ఐ, ఊట్కూర్ పోలీస్ స్టేషన్
4. ఎం.డి. ముస్తాక్ అలీ, ఏఎస్ఐ, ధన్వాడ పోలీస్ స్టేషన్
5. డి. మురళీధర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, డీఏఆర్
6. ఎం. వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, డీఏఆర్
7. కె. బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్, ఊట్కూర్ పోలీస్ స్టేషన్
8. ఎం.డి. లయీక్ అహ్మద్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, డీఏఆర్

వీరందరూ భవిష్యత్తులో మరింత ఉత్తమ సేవలు అందిస్తూ పోలీసు శాఖకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం, పోలీసు శాఖ నుండి తగిన గుర్తింపు అందిస్తోందని తెలిపారు.





## కోటకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేసిన గ్రామ సర్పంచ్

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 2**

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కోటకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు గ్రామ సర్పంచ్ వెంకట్రాములు గౌడ్, అనంతరం తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ అమరవీరులను గుర్తు చేసుకుంటూ తెలంగాణ వచ్చిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందామని ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని వారు అన్నారు, కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ నెంబర్ యాదగిరి, వార్డు మెంబర్లు భగవాన్, రఫీ, గోవిందు, మాజీ వార్డు మెంబర్లు చెవుల మల్లేష్, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశ వర్కర్లు, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు





# రైతుల కోసం సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్ దే

- **రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ది**
- **రైతులకు రైతు బీమా రైతు బంధు పథకం ద్వారా అనేక కుటుంబాలను ఆదుకున్నది బిఆర్ఎస్**

**చిన్న శంకరంపేట జూన్ 2**
**ఆశ్వి అప్డేట్స్...**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడం జరిగిందని దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధిలో ముందు ఉంచడం జరిగిందని మాజీ డిప్యూటీ స్పీకర్ బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆమె నివాళులర్పించారు, అనంతరం జాతీయ జెండా ఎగరవేసి జాతీయ గీతాలాపన చేశారు ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ది అని, రైతులు సంతోషంగా ఉండాలి రైతే రాజు కావాలని ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించి బీడు భూములను పంట భూములుగా మార్చి రైతుల కళ్ళల్లో ఆనందం చూసే విధంగా రైతులను అన్ని రంగాల్లో ఆదుకున్న ఘనత కేసీఆర్ దేనిని ఆమె తెలిపారు, రైతులకు ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతు భీమా,కల్పించడం జరిగిందని ఏ పంటకు కూడా ఎరువుల కొరత లేకుండా ఆదుకోవడం జరిగిందని ఆమె తెలిపారు, రేవంత్ రెడ్డి సర్కార్ రైతులను అన్ని రంగాలలో ఇబ్బందుల పాలు చేస్తుందని ఎరువుల కోసం ఉదయం నుండే వరుస క్రమంలో నిలబడడం జరిగిందని పండించిన పంట సైతం ఇప్పటివరకు పూర్తిగా కొనుగోలు చేయలేదని రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు, తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి పోరాడి సాధించుకున్న తెలంగాణను నిధులు, నీళ్లు, నియామకాలతో ఎంతో అభివృద్ధి పరచుకోవడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, స్థానిక ఉపసర్పంచ్ భానుప్రసాద్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పడాల శ్రీనివాస్, స్వామి రాజ్, దయానంద్ యాదవ్, సుధాకర్ నాయక్, ఏమ చంద్రం, నవీన్ కుమార్,ఏమ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**అక్బరుపేట భూంపల్లి మే 02 (ఆశ్వి అప్డేట్స్)**

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, రాష్ట్ర సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అక్బరుపేట భూంపల్లి మండలం తహశీల్దార్ బాలరాజు అన్నారు.మంగళవారం తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మాధవి, ఆర్ఐ లు స్వామి,సుమతి,సీనియర్ అసిస్టెంట్ కార్తీక్, రెవెన్యూ అధికారులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ కానుకగా

# "రావయ్యా మా పెద్దసారు" పాట

- **మాజీ మంత్రి కేటిరామ రావు చేతుల మీదుగా ఆవిష్కరణ**
- **ముక్కపల్లి శ్రీనివాస్ ని అభినందించిన కేటిఆర్**

**సిద్దిపేట, జూన్ 2(ఆశ్వి అప్డేట్స్ )**



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రముఖ గాయకుడు, రచయిత ముక్కపల్లి శ్రీనివాస్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై అభిమానంతో రచించి ఆలపించిన "రావయ్యా మా పెద్దసారు" పాటను మాజీ మంత్రి కే . టి . రామ రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ పాట ఉందని ప్రశంసించారు. కళాకారులు, రచయితలు తమ సృజనాత్మకతతో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమ భావజాలాన్ని భావితరాలకు చేరవేయడం అభినందనీయమన్నారు. ముక్కపల్లి శ్రీనివాస్ రచించి, స్వయంగా ఆలపించిన ఈ పాట ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ నిర్మాత నాగరాజు జర్నలిస్టు చిన్ని కృష్ణ ఉపాధ్యాయులు బాలయ్య తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## అమరుల త్యాగాలే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పునాది

**సిద్దిపేట, జూన్ 2 (ఆశ్వి అప్డేట్స్ ):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులు చేసిన త్యాగాలే రాష్ట్ర ఆవిర్భావానికి పునాదిగా నిలిచాయని పద్మనాభునిపల్లి గ్రామ సర్పంచ్ వేముల అరుణ రాజేశం అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ సర్పంచ్ అరుణ రాజేశం మాట్లాడుతూ, అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యదర్శి కేమ్మసారం మల్లేశం పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి తెలంగాణ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మండల రేణుక, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రుద్రారం యాదగిరి, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, ఆశా వర్కర్ శోభ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## ఆచార్య జయశంకర్ ఆశయాలు నెరవేరలేదు... భౌగోళిక తెలంగాణ వచ్చింది గానీ సామాజిక తెలంగాణ ఇంకా రాలేదు



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు జరిగిన ఉద్యమానికి ప్రధాన సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్. ఆయన తెలంగాణను కేవలం ఒక కొత్త రాష్ట్రంగా మాత్రమే చూడలేదు. తెలంగాణ ప్రజలకు తమ నీళ్లు, తమ నిధులు, తమ ఉద్యోగాలపై హక్కు రావాలని, సామాజిక న్యాయం నెలకొనాలని, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలని ఆయన ఆకాంక్షించారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో భౌగోళిక తెలంగాణ సాధ్యమైంది. కానీ ఆచార్య జయశంకర్ కలలుగన్న సామాజిక తెలంగాణ ఇంకా పూర్తిగా ఆవిష్కృతం కాలేదని ఆచార్య జయశంకర్ సేవాసమితి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కందమూరి బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి మూలాధారమైన "నీళ్లు - నిధులు - నియామకాలు" అనే నినాదం రాష్ట్ర ఆవిర్భావానికి ప్రధాన కారణమని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంత జల వనరులపై స్థానికులకు హక్కు కల్పించడం, రాష్ట్ర సంపదను తెలంగాణ ప్రజల అభివృద్ధికి వినియోగించడం, యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన అవకాశాలు కల్పించడం ఉద్యమ లక్ష్యాలని తెలిపారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నిరుద్యోగ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని, అనేక వర్గాలు ఇంకా అభివృద్ధి ఫలాలకు దూరంగానే ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, రైతాంగ సమస్యలు, విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో అసమానతలు కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. అంతేకాకుండా, తెలంగాణ ఉద్యమం ప్రకృతి సంపదల పరిరక్షణకు కూడా ప్రతీకగా నిలిచిందని బ్రహ్మయ్య పేర్కొన్నారు. కానీ నేడు అభివృద్ధి పేరుతో కొండలు, చెరువులు, వాగులు, అడవులు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు. "నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ పుట్టింది. కానీ నేడు ఆ ఆశయాలను పక్కనబెట్టి ప్రకృతి సంపదను దోచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెరువులు కనుమరుగవుతున్నాయి. కొండలు తవ్వకాల బారిన పడుతున్నాయి. అడవులు క్షీణిస్తున్నాయి. ఇవి కేవలం పర్యావరణ సమస్యలు మాత్రమే కాదు, భావితరాల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలు" అని ఆయన అన్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలు నిజమైన అర్థంలో నెరవేరాలంటే సామాజిక న్యాయం, పారదర్శక పాలన, ప్రకృతి పరిరక్షణ, నిరుద్యోగ యువతకు అవకాశాలు, రైతాంగ సంక్షేమం, వెనుకబడిన వర్గాల సాధికారత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బ్రహ్మయ్య సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం చారిత్రాత్మక విజయమే అయినప్పటికీ, ఆ విజయాన్ని సంపూర్ణం చేసే బాధ్యత ఇంకా మిగిలే ఉందన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను కేవలం ఉత్సవాలుగా కాకుండా ఉద్యమ ఆశయాలను గుర్తు చేసుకునే సందర్భంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. చివరగా ఆయన మాట్లాడుతూ, "ఆచార్య జయశంకర్ గారు కలలుగన్న తెలంగాణ అంటే కేవలం భౌగోళిక సరిహద్దులు కాదు. ప్రతి పేదవాడి ఇంట్లో ఆశ వెలిగే తెలంగాణ, ప్రతి యువకుడికి అవకాశం దక్కే తెలంగాణ, ప్రతి రైతు గౌరవంగా బతికే తెలంగాణ, ప్రకృతి సంపదలు పరిరక్షించబడే తెలంగాణ. ఆ దిశగా ప్రయాణించినప్పుడే ఆయన ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది" అని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ ఘన సన్మాన కార్యక్రమం ఆచార్య జయశంకర్ సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో విశేష సేవలందించిన ఉద్యమకారులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని సమితి అధ్యక్షుడు కందమూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ కలం, గళం, కళల ద్వారా పోరాటానికి బలాన్ని చేకూర్చిన ఉద్యమకారులు, కవులు, కళాకారులు, జర్నలిస్టుల సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో వారి పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు.
కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ ఆశయాల సాధన కోసం సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం పోరాడిన వారిని గుర్తించి సన్మానించడం ద్వారా యువతకు ఉద్యమ చరిత్రను చేరవేయవచ్చని అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు, సాహితీవేత్తలు, జర్నలిస్టులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఈ సన్మాన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారుఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సహజ సికిందర్ ఖాజా పా
గంజి లక్ష్మీదేవి శేఖర్ గౌడ్, మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ దినేష్ రవి బాలు తదితరులకు ఘనంగా సన్మానించారు

# మిలియన్ మార్చ్ ను తలపించేలా భూపోరాటం

- **జులై 2 న ఉప్పల్ భగాయల్ లో పెద్ద ఎత్తున భూపోరాటం చేస్తాం**
- **పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిస్తున్న**
- **టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్:**
తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్ ను తలపించే భూపోరాటాన్ని చేస్తామని తెలంగాణ రక్షణ సేన ఛీప్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై విస్పష్ట ప్రకటన చేస్తారని భావించినప్పటికీ మరోసారి మోసం చేశారన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటంతో సిద్ధించిన తెలంగాణలో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం 12 ఏళ్లైనా హైదరాబాద్ లో ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆగస్ట్ 6 లోపు జయశంకర్ సార్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి కవిత అల్టిమేటం జారీ చేశారు.

**మిలియన్ మార్చ్ తరహా భూపోరాటం**
ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానైనా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తారని భావించినప్పటికీ మళ్లీ మోసం చేశారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అ అంశాలను ప్రస్తావించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కేకే కమిటీ విధివిధానాలను కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జులై 2న ఉప్పల్ భగాయత్ వేదికగా అతి పెద్ద 'భూపోరాటం' చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని, ఇది తెలంగాణ అస్తిత్వం, ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటమని స్పష్టం చేశారు.ఈ మహా సంగ్రామానికి రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రికా మిత్రులతో పాటు ప్రజలు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊరికి ఒక్కరైనా సద్ది కట్టుకొని తరలిరావాలని కోరారు. 'మిలియన్ మార్చ్' ను గుర్తు చేసే విధంగా ఈ భూపోరాట ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు.

**ఆగస్ట్ 6 లోగా జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలి**
తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 12 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోకపోవడం అత్యంత అన్యాయమైన విషయమని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసి, మలిదశ పోరాటానికి దిక్సూచిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని అన్నారు. తెలంగాణ జాగృతి తరఫున ఇప్పటికే నాలుగు జిల్లాల్లో జయశంకర్ సార్ విగ్రహాలను ఏర్పాటు చేశామని కవిత గుర్తు చేశారు. అయితే రాష్ట్ర రాజధానిలో ఆయన విగ్రహం ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటు కోసం తెలంగాణ జాగృతి సంస్థ 2014 నుంచే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. 2017 లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా అధికారికంగా లేఖ రాసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేన్నరేళ్లు గడుస్తున్న విగ్రహం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి అయిన ఆగస్ట్ 6 లోపు ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశామని కవిత చెప్పారు. తమకు అవకాశం ఇస్తే ఆ విగ్రహ ఏర్పాటుతో పాటు లైఫ్ టైమ్ మెయింటెనెన్స్ ను కూడా తామే చేపడతమన్నారు. తమకన్నా గొప్పగా ప్రభుత్వమే స్వయంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. కానీ ఆగస్ట్ 6 లోపు హైదరాబాద్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం**
రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు, ఉద్యమకారులను మది నిండా, ఆర్తితో గుర్తు చేసుకుంటున్నామని అన్నారు. ఉద్యమంలో ఆస్తులు, ఉద్యోగాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. అలాంటి వారందరినీ అన్ని విధాలా ఆదుకొని, సముచిత రీతిలో గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి అమరవీరుడి కుటుంబానికి 1 కోటి రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఉద్యమకారులందరినీ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఎందరో ఉద్యమకారుల పోరాటం, ప్రాణ త్యాగాలతో రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. ఉద్యమ చరిత్ర ఇప్పటి పిల్లలంతా కచ్చితంగా తెలుసుకోవాలని కవిత సూచించారు. జూన్ 2 అనేది హాలిడే కాదని.. తెలంగాణ సమాజానికి ఎలాంటి వివక్ష లేకుండా, తమ సొంత యాసను తాము స్వేచ్ఛగా మాట్లాడుకునేలా చేసిన మహత్తరమైన రోజు అని చెప్పారు. మనమంతా సెకండ్ గ్రేడ్ పౌరులం కాదని నిరూపిస్తూ, ఎంతో స్వేచ్ఛగా బతికే చారిత్రక అవకాశం వచ్చిన రోజని అన్నారు. అందుకే ఆగస్టు 15 వేడుకలను ఎంత గొప్పగా జరుపుకుంటామో.. జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని కూడా అంతే గొప్పగా జరుపుకోవాలని సూచించారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది

- **ఎల్బీనగర్ చౌరస్తాలో ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారికి ఘన నివాళి**







**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు జరిగిన ఉద్యమానికి ప్రధాన సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్. ఆయన తెలంగాణను కేవలం ఒక కొత్త రాష్ట్రంగా మాత్రమే చూడలేదు. తెలంగాణ ప్రజలకు తమ నీళ్లు, తమ నిధులు, తమ ఉద్యోగాలపై హక్కు రావాలని, సామాజిక న్యాయం నెలకొనాలని, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలని ఆయన ఆకాంక్షించారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో భౌగోళిక తెలంగాణ సాధ్యమైంది. కానీ ఆచార్య జయశంకర్ కలలుగన్న సామాజిక తెలంగాణ ఇంకా పూర్తిగా ఆవిష్కృతం కాలేదని ఉద్యమకారులు కాచం సత్యనారాయణ అన్నారు. జేఏసీ అధ్యక్షులు రంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి మూలాధారమైన "నీళ్లు - నిధులు - నియామకాలు" అనే నినాదం రాష్ట్ర ఆవిర్భావానికి ప్రధాన కారణమని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంత జల వనరులపై స్థానికులకు హక్కు కల్పించడం, రాష్ట్ర సంపదను తెలంగాణ ప్రజల అభివృద్ధికి వినియోగించడం, యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన అవకాశాలు కల్పించడం ఉద్యమ లక్ష్యాలని తెలిపారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నిరుద్యోగ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని, అనేక వర్గాలు ఇంకా అభివృద్ధి ఫలాలకు దూరంగానే ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, రైతాంగ సమస్యలు, విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో అసమానతలు కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. అంతేకాకుండా, తెలంగాణ ఉద్యమం ప్రకృతి సంపదల పరిరక్షణకు కూడా ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. కానీ నేడు అభివృద్ధి పేరుతో కొండలు, చెరువులు, వాగులు, అడవులు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు. మహిళా చైర్ పర్సన్ బోర్డ్ మెంబర్ కాసోజు శంకరమ్మ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ పుట్టింది. కానీ నేడు ఆ ఆశయాలను పక్కనబెట్టి ప్రకృతి సంపదను దోచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెరువులు కనుమరుగవుతున్నాయి. కొండలు తవ్వకాల బారిన పడుతున్నాయి. అడవులు క్షీణిస్తున్నాయి. ఇవి కేవలం పర్యావరణ సమస్యలు మాత్రమే కాదు, భావితరాల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలు" అని ఆమె అన్నారు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం చారిత్రాత్మక విజయమే అయినప్పటికీ, ఆ విజయాన్ని సంపూర్ణం చేసే బాధ్యత ఇంకా మిగిలే ఉందన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను కేవలం ఉత్సవాలుగా కాకుండా ఉద్యమ ఆశయాలను గుర్తు చేసుకునే సందర్భంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. "ఆచార్య జయశంకర్ కలలుగన్న తెలంగాణ అంటే కేవలం భౌగోళిక సరిహద్దులు కాదు. ప్రతి పేదవాడి ఇంట్లో ఆశ వెలిగే తెలంగాణ, ప్రతి యువకుడికి అవకాశం దక్కే తెలంగాణ, ప్రతి రైతు గౌరవంగా బతికే తెలంగాణ, ప్రకృతి సంపదలు పరిరక్షించబడే తెలంగాణ. ఆ దిశగా ప్రయాణించినప్పుడే ఆయన ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది" అని కాసోజు శంకరమ్మ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ కలం, గళం, కళల ద్వారా పోరాటానికి బలాన్ని చేకూర్చిన ఉద్యమకారులు, జర్నలిస్టుల సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో వారి పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పలువురు జర్నలిస్ట్ లు మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ ఆశయాల సాధన కోసం సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం పోరాడిన వారిని గుర్తించి సన్మానించడం ద్వారా యువతకు ఉద్యమ చరిత్రను చేరవేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో , తెలంగాణ ఉద్యమజర్నలిస్టులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఈ సన్మాన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ఉద్యమ జర్నలిస్టులకు ఘనంగా సన్మానించారు

# పవన్ ఎంట్రీతో రాజకీయ వేడి

(తెలంగాణ రాజకీయాల్లో పెరుగుతున్న వివాదాలు, తనపై వ్యక్తమవుతున్న విమర్శలు, ప్రాంతీయ విద్వేషాల ఆరోపణలు, భూకబ్జా ప్రచారం, గద్దర్ పేరు చుట్టూ సాగుతున్న రాజకీయ చర్చలపై జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకేసారి విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశాన్ని రాజకీయ ప్రత్యర్థులకు హెచ్చరిక వేదికగా మార్చిన పవన్, తెలంగాణలో ఇకపై జనసేన పార్టీ కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. "తెలంగాణ ఎవరి సొత్తు కాదు... బెదిరిస్తే భయపడే వ్యక్తిని కాదు... తెలంగాణకు రావొద్దని చెప్పే హక్కు ఎవరికీ లేదు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తనపై చేస్తున్న ఆరోపణలను సవాల్‌గా స్వీకరిస్తూ, రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధమని ప్రకటించారు.)




- **తెలంగాణలో జనసేన పార్టీ ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని పవన్ కల్యాణ్ సంచలన ప్రకటన**
- **తెలంగాణ ఎవరి జాగీరు కాదు" అంటూ విమర్శకులకు ఘాటైన హెచ్చరిక**
- **తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే ప్రశ్నించానని స్పష్టీకరణ**
- **ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలపై తీవ్ర ఆగ్రహం**
- **గద్దర్‌తో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న జనసేనాని**
- **గద్దర్ అడిగిన వెంటనే కారు కొనిచ్చానని భావోద్వేగ వ్యాఖ్యలు**
- **గద్దర్ బతికున్నప్పుడు పట్టించుకోని వారే ఇప్పుడు మాట్లాడుతున్నారని విమర్శ**
- **చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా సవాల్**
- **ఆరోపణలు నిజమైతే ఆస్తిని ప్రభుత్వానికే రాసిస్తానని ప్రకటన**
- **తెలంగాణలో స్వయంగా పర్యటించి పార్టీని బలోపేతం చేస్తానని హామీ**
- **అధికారం కోసం కాదు, సామాజిక మార్పు కోసమే రాజకీయాలంటూ స్పష్టం**

- **తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు, కొత్త సమీకరణాలకు తెరలేపిన పవన్ వ్యాఖ్యలు**

**కాసోజు శంకరాచారి,(అశ్వి అప్డేట్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్); జూన్ 02:**

**"తెలంగాణ ఎవరి అయ్య జాగీరా?"... ప్రత్యర్థులపై నిప్పులు చెరిగిన పవన్:**
ఇటీవలి కాలంలో తెలంగాణలో కొందరు రాజకీయ నాయకులు, విశ్లేషకులు తనపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అడుగు పెడితే అడ్డుకుంటామని, దాడులు చేస్తామని, ఇక్కడ రాజకీయాలు చేయడానికి హక్కు లేదని కొందరు మాట్లాడుతున్నారని ఆరోపించారు. "తెలంగాణ ఏమైనా ఎవరి అయ్య జాగీరా? భారతదేశ పౌరుడిగా దేశంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు నాకు ఉంది. హైదరాబాద్‌లో అడుగు పెట్టొద్దని, తెలంగాణలో మాట్లాడొద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదు. బెదిరింపులతో భయపెట్టగలమని అనుకునే వారు నన్ను సరిగా అర్థం చేసుకోలేదు" అంటూ ఘాటుగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వేలాది మంది యువత త్యాగాలను తాను ఎప్పటికీ గౌరవిస్తానని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల తనకు గౌరవం ఉందని అన్నారు. అలాంటి తననే తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరించడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

**తెలంగాణలో జనసేన పోటీ ఖాయం... ఇక ప్రత్యక్ష పోరాటమే:**
తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన ప్రకటన జనసేన ఎన్నికల బరిలోకి దిగుతుందనేదే. ఇప్పటి వరకు తెలంగాణలో పరిమిత స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించిన జనసేన ఇకపై పూర్తి స్థాయి రాజకీయ పోరాటానికి సిద్ధమవుతోందని పవన్ స్పష్టం చేశారు. "కార్యకర్తలు, నాయకులు ఎన్నో సంవత్సరాలుగా తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని కోరుతున్నారు. ఇన్నాళ్లు సమయం కోసం ఎదురుచూశాం. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. తెలంగాణలో జనసేన ఉంటుంది... ఎన్నికల్లో పోటీ చేస్తుంది... నేనే స్వయంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తాను. ప్రజల సమస్యల కోసం పోరాడుతాను" అని ప్రకటించారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ కొనసాగుతున్న సమయంలో జనసేన ప్రవేశం రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**"నాకు ఆంధ్రాలోనే సీఎం అయ్యే దిక్కులేదు"... విమర్శకులపై వ్యంగ్యాస్త్రాలు**
తాను తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నానని చేస్తున్న ఆరోపణలను పవన్ తీవ్రంగా ఖండించారు. "నాకు ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి అయ్యే దిక్కులేదు. అక్కడే అలాంటి ఆశ పెట్టుకోలేదు. అలాంటిది తెలంగాణలో సీఎం కావాలనే కోరిక నాకు ఎందుకు ఉంటుంది?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. తన రాజకీయ లక్ష్యం పదవులు కాదని, ప్రజా సమస్యల పరిష్కారం, వ్యవస్థలో మార్పు, యువతకు అవకాశాలు కల్పించడమేనని స్పష్టం చేశారు. రాజకీయాలు తనకు అధికార సాధన కాదని, సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

**తెలంగాణకు వ్యతిరేకం కాదు... విభజన తీరుకే వ్యతిరేకం:**
తెలంగాణపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేసిన పవన్, తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని పేర్కొన్నారు. "నేను వ్యతిరేకించింది రాష్ట్ర విభజన జరిగిన విధానాన్ని మాత్రమే. పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య సంప్రదాయాలను పక్కనపెట్టి తీసుకున్న నిర్ణయాలను ప్రశ్నించాను. తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఎప్పుడూ గౌరవించాను" అని తెలిపారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని, యువతలో ప్రాంతీయ విద్వేషాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

**గద్దర్ జ్ఞాపకాలతో భావోద్వేగం... "ఆయన నాకు అన్న లాంటి వారు":**
మీడియా సమావేశంలో అత్యంత భావోద్వేగ క్షణాలు గద్దర్ గురించి మాట్లాడినప్పుడే కనిపించాయి. ప్రజా గాయకుడు గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పవన్ పలుమార్లు భావోద్వేగానికి లోనయ్యారు. "గద్దరన్న నన్ను 'ఒరేయ్ తమ్మీ' అని పిలిచేవారు. ఆయనకు నాతో అంతటి చనువు ఉండేది. వెన్నులో బుల్లెట్లు ఉండటం వల్ల నడవడానికి ఇబ్బంది పడుతున్న సమయంలో నన్ను సంప్రదించి వాహనం కొనివ్వమని అడిగారు. నేను 24 గంటల్లోనే కొనిచ్చాను" అని చెప్పారు. ఈ విషయం ఇప్పటి వరకు ఎప్పుడూ బయటపెట్టలేదని వెల్లడించారు. గద్దర్ చివరి రోజుల్లో ఆస్పత్రిలో ఉన్నప్పుడు కూడా వెళ్లి కలిశానని, యువత భవిష్యత్తుపై ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ తన మనసులో ఉన్నాయని అన్నారు.

**"గద్దర్ బతికున్నప్పుడు మీరేం చేశారు?"**
గద్దర్ పేరుతో రాజకీయాలు చేస్తున్న వారిపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఈరోజు గద్దర్ గురించి గొప్పలు చెప్పే వాళ్లు, ఆయన బతికున్నప్పుడు ఎక్కడ ఉన్నారు? ఆయనకు ఎన్ని సార్లు అండగా నిలబడ్డారు? ఆయనకు అవసరం ఉన్నప్పుడు సహాయం చేశారా?" అంటూ ప్రశ్నించారు. గద్దర్‌ను కేవలం రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమని, ఆయన పోరాట స్ఫూర్తిని అర్థం చేసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు.

**చెరువు కబ్జా ఆరోపణలపై రేవంత్‌కు బహిరంగ సవాల్:**
తనపై వస్తున్న చెరువు కబ్జా ఆరోపణలపై కూడా పవన్ ఘాటుగా స్పందించారు. "నేను చెరువు కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని నేరుగా కోరుతున్నాను. పూర్తి స్థాయి విచారణ జరిపించండి. నేను తప్పు చేశానని తేలితే ఆ ఆస్తిని తెలంగాణ ప్రభుత్వానికే రాసి ఇస్తాను" అని ప్రకటించారు. "నిజంగా నేను కబ్జా చేసి ఉంటే ఇప్పటికి నా ఇంటి ముందు వేల మంది నిరసనలు చేసేవారు. నా ఇల్లు తగలబెట్టేవారు. నేను తప్పు చేయలేదు కాబట్టే ధైర్యంగా మాట్లాడుతున్నాను" అని వ్యాఖ్యానించారు.

**ప్రాంతీయ విద్వేషాలు దేశానికి ఉగ్రవాదం కంటే ప్రమాదకరం:-**
ప్రాంతీయ రాజకీయాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను పెంచడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని పవన్ హెచ్చరించారు. తెలంగాణలో సమస్యలు వస్తే ఆంధ్ర ప్రజలపై నెట్టడం, ఆంధ్రప్రదేశ్‌లో సమస్యలు వస్తే తెలంగాణ ప్రజలను నిందించడం సరికాదన్నారు. నాయకుల రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను విడదీయడం దేశ సమగ్రతకు ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం:**
పవన్ కల్యాణ్ మీడియా సమావేశం కేవలం వివరణాత్మక సమావేశం మాత్రమే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన స్పష్టమైన రాజకీయ ప్రకటనగా మారింది. తెలంగాణలో పార్టీ విస్తరణ, ఎన్నికల్లో పోటీ, విమర్శకులకు సవాళ్లు, గద్దర్‌తో అనుబంధం, భూకబ్జా ఆరోపణలపై ధీటైన సమాధానాలు... అన్నీ కలిపి ఈ సమావేశాన్ని రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన ఘటనగా నిలిపాయి. జనసేన తెలంగాణలో ఎంత మేరకు ప్రభావం చూపుతుంది? పవన్ కల్యాణ్ పర్యటనలు ఏ స్థాయిలో రాజకీయ చర్చకు దారి తీస్తాయి? అధికార, ప్రతిపక్ష పార్టీల వ్యూహాలు ఎలా మారతాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... తెలంగాణ రాజకీయ వేదికపై జనసేన తన ఉనికిని గట్టిగా చాటుకునే దిశగా అడుగులు వేస్తోంది.



# ట్రిపుల్ 8 రూల్.. లైఫ్ సక్సెస్ మంత్రా




జీవితంలో సక్సెస్ కావాలని, అనుకున్నది అందిపుచ్చుకోవాలని ప్రతి ఒక్కరూ కలలు కంటారు. అందుకోసం అహర్నిశలు శ్రమించేవారు కూడా ఎందరో. కానీ విజయం అందరినీ వరించదు. కొందరికి కనీసం దర్శనం కూడా ఇవ్వదు. మరికొందరు అలా వచ్చి పలకరించి ఇలా వెళ్లిపోతుంది. కానీ కొందరు ఉంటారు.. సక్సెస్ వారి దగ్గరకి రావడం కాదు.. వారితోనే తిష్టవేసుకుని కూర్చుంటుంది. అలాంటి లైఫ్ సక్సెస్‌కు బెస్ట్ మంత్రా ట్రిపుల్8 రూల్. మనిషి జీవితంలో అన్నింటికన్నా విలువైనది ఏంటి అంటే.. బంధాలు, మనం, మనీ ఇలా అనేక రకాల సమాధానాలు వస్తాయి. కానీ అవన్నీ తప్పవు.. మనిషి జీవితంలో అన్నింటికన్నా విలువైనది ఏదైనా ఉందంటే అది సమయం మాత్రమే. మనం సక్సెస్ కావాలన్నా, ఫెయిల్యూర్‌గా కావాలన్నా ఉన్న 24 గంటల సమయాన్ని మనం ఎలా వినియోగించుకున్నాం, ఎలా మేనేజ్ చేశాం అన్నదే డిసైడ్ చేస్తుంది. ప్రస్తుతం ఉన్న వర్క్ కల్చర్ లో ఇప్పుడు టైం మేనేజ్మెంట్ అనేది ఉద్యోగుల జీవితాల్లో అతి క్లిష్టమైన అంశంగా మారిపోతోందని చెబుతున్నారు. అయితే దీనికి ఓ పరిష్కారాన్ని తెరపైకి తెస్తున్నారు నిపుణులు! అవును... ప్రతీ మనిషి జీవితంలోనూ రోజుకి 24 గంటలే ఉంటాయి. అయితే ఇందులో చాలా మంది వృత్తి పరమైన జీవితం కోసం వ్యక్తిగత జీవితాన్ని.. వ్యక్తిగత జీవితం కోసం కుటుంబ జీవితాన్ని దూరం చేసుకుంటూ ఇబ్బంది పడుతుంటారని అంటారు. ఈ నేపథ్యంలోనే ఎన్నో వ్యక్తిగత సమస్యలను ఫెస్ చేస్తుంటారని చెబుతుంటారు. ఈ సమయంలో ట్రిపుల్8 రూల్ ఒకటి అందుకు తగిన పరిష్కారం అని అంటున్నారు.

ఈ ట్రిపుల్8 రూల్ ప్రకారం... ఒక రోజులో ఉండే 24 గంటలను ఎనిమిదేసి గంటల చొప్పున విభజించుకోవాలి. ఇందులో భాగంగా.. ఎనిమిది గంటలు ఉద్యోగానికి ఖర్చు చేస్తే.. మరో ఎనిమిది గంటలను మీ అలవాట్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా గడిపడానికి వినియోగించుకోవాలి. మిగిలిన ఎనిమిది గంటలూ నాణ్యమైన నిద్రకు కేటాయించుకోవాలి.ఇలా రోజుని ప్లాన్ చేసుకోవడం ద్వారా శారీరక, పాటు మానసిక ఆరోగ్యం జీవితంలో ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకొనేందుకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ రూల్ ని దైనందిన జీవితంలో ఓ అలవాటుగా మార్చుకుంటే... దీర్ఘకాలంలో ఎన్నో సత్ఫలితాలు సాధించవచ్చని చెబుతున్నారు. ఫలితంగా మీ అభిరుచులకు కేటాయించే సమయాన్ని పెంచుకోవచ్చని అంటున్నారు.

అయితే ప్రస్తుతం మెజారిటీ ఉద్యోగుల జీవితాలు యాంత్రికమైపోయిన నేపథ్యంలో... ఈ రూల్ ని అమలుచేసుకోవడం అంత తేలిక కాదనే చెప్పాలి. ప్రతీ రోజునీ ఎనిమిదేసి గంటల చొప్పున షెడ్యూల్ చేసుకుని అమలు చేయాలంటే ఇందులో అనేక రకాల అడ్డంకులు ఎదురవుతుంటాయి. కాకపోతే... సరైన ప్రాణాళిక వేసుకుని, అంకితభావంతో పాటిస్తే మాత్రం... గొప్ప విజయాలు సాధించవచ్చు!




# పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారా తప్పకుండా ఈ విషయం తెలుసుకోండి

ప్రస్తుత పరుగుల ప్రపంచంలో చీటికి మాటికి నొప్పులు రావడం చాలా సాధారణమైపోయింది. అధికంగా కూర్చోవడం వల్ల నడుము నొప్పులు, తలనొప్పి, ఇలా మరెన్నో సమస్యలు. రాత్రి పడుకునే సమయానికి శరీరంలో ఏదో ఒక భాగం నొప్పి పుడుతుండటం చాలా సాధారణమైపోయింది. ఇలా మనకు బాడీలో చిన్న పెయిన్ వచ్చినా వెంటనే బాడీ సహకరించడం లేదు అని పెయిన్ కిల్లర్ వేసుకుంటాము.. మనమే కాదు పండు ముసలి నుంచి యంగ్ కుర్రాడు వరకూ ఇదే.. ఈ మధ్య చిన్నపిల్లలకు కూడా కాలు చెయ్యి నొప్పి వస్తోంది అంటే పెయిన్ కిల్లర్ వేయడం చేస్తున్నారు పేరెంట్స్ .

ఇలా తెలిసి తెలియని మందులు వాడటం అసలు సమస్య ఏమిటో తెలియకుండా మెడిస తీసుకుంటే చాలా సమస్యలు వస్తాయి అంటున్నారు డాక్టర్లు , ఇక పెద్ద వారి విషయం ఎలా ఉన్నా ఈ పెయిన్ కిల్లర్స్ అధిక మోతాదు వాడితే విషపూరితం అవుతాయి అంటున్నారు తాజాగా అమెరికాలోని ఎమోరీ యూనివర్సిటీ పరిశోధకులు. పెయిన్ కిల్లర్లు అధిక మోతాదు తీసుకుంటే అవి విషపూరితం అవుతాయని తమ అధ్యయనంలో వెల్లడైనట్టు చెప్పారు. చిన్నారుల్లో ఓపియాడ్ మహమ్మారి తీవ్ర ప్రభావం చూపుతుందని తేలిందని తెలిపారు మన ప్రపంచంలో పెయిన్ కిల్లర్స్ ఎక్కువ వాడుతున్న దేశం అమెరికా అందులో చిన్నారులు కూడా 60 శాతం మంది అదే పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారట.




# భోజనం చేశాకే నీళ్లు ఎందుకు తాగకూడదు?



భోజనం చేసిన తర్వాత నీళ్లు తాగడం చాలా సాధారణం. ప్రతి ఒక్కరికీ ఇదొక అలవాటు కూడా. కానీ కొందరు మాత్రం భోజనం చేసే సమయంలో నీళ్లు తాగకూడదని అంటే మరికొందరు భోజనం చేసిన తర్వాత గంట వరకు నీళ్లు తాగకూడదని మరికొందరు అంటారు. ఆయుర్వేదం కూడా ఇదే విషయం చెప్తోంది. భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగకూడదని. సాధారణంగా అయితే నీరు తాగడం మనకు ఎంతో ప్రయోజనకరం. ఇది మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా అవయవాలు సక్రమంగా తమ పని చేయడానికి దోహదపడతాయి. కానీ భోజనం చేసిన తర్వాత తాగితే మాత్రం మేలు చేయకపోగా కీడు చేస్తాయని అంటున్నారు. అసలు భోజనం తర్వాత మంచినీళ్లు ఎందుకు తాగకూడదు. నిపుణులు ఏమంటున్నారు.

**భోజనం తర్వాత నీళ్లు ఇందుకే తాగకూడదు..**

ఆయుర్వేదం చెబుతున్న ప్రకారం ఆహారం తిన్న వెంటనే నీరు త్రాగడం వల్ల జీర్ణరసాలు పలుచగా మారతాయి. దీనివల్ల జీర్ణక్రియ సవ్యంగా సాగదు. అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. ఇది నిజమేనని సైన్స్ కూడా చెబుతోంది. భోజనం తిన్న వెంటనే నీరు తాగితే బరువు త్వరగా పెరుగుతారని, ఊబకాయం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. భోజనం చేసిన తర్వాత వెంటనే నీరు తాగడం వల్ల ఆహారాన్ని జీర్ణం చేయడానికి, జీర్ణవ్యవస్థ తీసుకునే సహజ సమయాన్ని నీరు తాగడం ద్వారా మార్చేస్తున్నట్టే లెక్క. దీనివల్ల ఊహించిన దాని కంటే ముందుగానే ఆకలి వేస్తుంది. అప్పుడు అతిగా తింటారు. కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు వైద్యులు.

భోజనం తర్వాత శరీరంలో చేరిన నీరు జీర్ణ ఎంజైములను పల్చగా మారుస్తుంది. దీనివల్ల ఎసిడిటీ సమస్య వస్తుంది. గుండెల్లో మంట కూడా రావచ్చు. ఆహారం తిన్న వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణం కాకుండా ఆహారం చాలా వరకు మిగిలిపోతుంది. ఇది కొవ్వు రూపంలో నిల్వ అవుతుంది. ఈ ప్రక్రియ ఇన్సులిన్ స్థాయిలను అమాంతం పెంచుతాయి. దీనివల్ల మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక మధుమేహం ఉన్నవారు భోజనం తిన్న వెంటనే నీటిని తాగకూడదు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

**ఎప్పుడు తాగాలి?**

భోజనం తినడానికి అరగంట ముందు, భోజనం తిన్న అరగంట తర్వాత నీరు తాగడం ఉత్తమం అని వివరిస్తున్నారు ఆయుర్వేద వైద్యులు. ఇది ఆహారాన్ని మృదువుగా మారుస్తుంది. అయితే చల్లటి నీటిని మాత్రం తాగకూడదు. ఎందుకంటే అన్నం తిన్న వెంటనే చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణక్రియ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. జీర్ణవ్యవస్థలో టాక్సిన్స్ పేరుకుపోయే అవకాశం ఉంది. యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు కూడా రావచ్చు. అలాగే భోజనం తినేటప్పుడు కెఫీన్ నిండిన పానీయాలు, కూల్ డ్రింకులు కూడా తాగడం మానేయాలి.





తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తోన్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే ఇలాంటి వార్తలపై స్పందించని త్రిష (Trisha) పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేసిన ఆమె.. దానికి ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. 'నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను' అని రాసుకొచ్చారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ.. తనపై రూమర్స్ క్రియేట్ చేస్తోన్న వారిని ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్ పెట్టారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

ఇక మే నెల ప్రారంభంలో పెట్టినట్లు నెలాఖరులోనూ త్రిష పోస్ట్ పెట్టారు. ఈ నెల మొదట్లో.. 'నాకు ఇష్టమైన మంత్ వచ్చేసింది' అని పెట్టిన ఆమె.. తాజాగా 'ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా నా ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుంది' అని కొన్ని ఫొటోలు షేర్ చేశారు. దీనికి 'మ్యాజికల్ మే..' అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే రోజు తన స్నేహితుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకోవడంతో ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయింది. దానితో పాటు ఆమె నటించిన 'కరుప్పు' హిట్‌గా నిలిచి రూ.348 కోట్లకు పైగా వసూళ్లు చేసింది.

# వ్యక్తిగత విషయాలపై రూమర్స్.. పరోక్షంగా స్పందించిన త్రిష

# టాలీవుడ్ ఇండస్ట్రీపై జాన్వీ ప్రశంసలు..

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ 'పెద్ది' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో విడుదల కాబోతున్న (జూన్4) ఈ సినిమాలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబోలో రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జాన్వీ టాలీవుడ్, బాలీవుడ్‌ల మధ్య ఉన్న తేడా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌లో పని గంటలకు ఎక్కువ ప్రాధాన్య ఉంటుందని అది తనకు చాలా నచ్చినట్లు తెలిపింది. సౌత్ సినిమా షూటింగ్‌లో అందరిలో ఒకరకమైన ఆసక్తి ఉంటుంది. అక్కడ కేవలం ఓ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనో డెడ్‌లైన్లలో అందుకోవాలనో మాత్రమే పనిచేయరని అన్నారు. సినిమాలోని ప్రతీ సీన్ అద్భుతంగా రావాలనే ప్రయత్నిస్తారని.. దానికోసం ఎంత సమయాన్ని అయినా కేటాయిస్తారని ప్రశంసించారు. హిందీ సినిమా విషయానికొస్తే.. అక్కడ బడ్జెట్, టైమ్‌లైన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని.. అంతా రూల్ ప్రకారం జరుగుతుందని తెలిపింది.

కొన్నిసార్లు అతిజాగ్రత్తల వల్ల క్రియేటివిటీ విషయంలో రాజీపడాల్సి వస్తుందని.. అలాగే పక్కా ప్రణాళికల వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయని అన్నారు. ఇక తెలుగులో సినిమా సెట్స్‌లో బ్రేక్ టైమింగ్స్ కూడా చాలా ఖచ్చితంగా పాటిస్తారని జాన్వీ పేర్కొన్నారు. అక్కడ లంచ్ బ్రేక్ ఇస్తే, ప్రతి ఒక్కరూ కంగారు పడకుండా సుమారు 40 నిమిషాల పాటు ప్రశాంతంగా భోజనం చేయడానికి సమయం దొరుకుతుందని.. ఆ తర్వాత పని ప్రారంభించే ముందు కనీసం ఒక 20 నిమిషాల పాటు చిన్నపాటి నిద్ర తీసేందుకు కూడా వీలుంటుందని చెప్పారు. అయితే, ఇలాంటి సౌకర్యాలు కొన్నిసార్లు తమ బాలీవుడ్ ఇండస్ట్రీలో లోపిస్తాయని, అక్కడ ఈ విషయాల్లో కాస్త రాజీ పడాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తాను తెలుగులో చేసిన ప్రాజెక్ట్‌ల సమయంలో ఎప్పుడూ లాంగ్ షిఫ్ట్‌లు చేయాల్సిన అవసరం రాలేదని జాన్వీ గుర్తుచేసుకున్నారు. కేవలం ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే 12 గంటల పాటు షూటింగ్‌లో పాల్గొన్నానని.. మిగతా అన్ని రోజుల్లో కేవలం 9 నుండి 10 గంటల లోపే తన పని ముగించుకుని ప్యాకప్ చెప్పేవాళ్లని తెలిపారు.



# ప్రభాస్ స్పిరిట్‌లో ఆ స్టార్ నటి.. మరోసారి హిట్ కాంబో రిపీట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'స్పిరిట్' ఒకటి. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌ను టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై భూషన్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా.. క్రిష్ ఫేమ్ వివేక్ ఒబెరాయ్ పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. తాజాగా ఓ సూపర్ అప్డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. స్పిరిట్‌లో నటి నదియా ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగా.. ఆమె షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు తెలుస్తుంది. ఈ మేరకు నటీనటులకు ఏర్పాటు చేసిన క్యారివ్యాన్‌కు సంబంధించిన దాంట్లో నటి నదియా పేరు మీద క్యారివ్యాన్ రిజర్వ్ చేసి ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించి వీడియో వైరల్ అవుతుండగా.. స్పిరిట్ చిత్రంతో మరోసారి ప్రభాస్‌తో నదియా స్క్రీన్ చేసుకోబోతుందని తెలిసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ప్రభాస్, నదియా కాంబోలో ఇప్పటికే 'మిర్చి' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రభాస్ తల్లి పాత్రలో నదియా నటించగా.. తల్లీకొడుకులుగా ప్రభాస్, నదియా కాంబోకు ఫుల్ క్రేజ్ ఏర్పడింది. ఇప్పుడు వీరిద్దరు స్పిరిట్ కోసం కలిసి వర్క్ చేస్తుండగా.. ఈసారి నదియా ప్రభాస్ పక్కన ఎలాంటి పాత్ర పోషిస్తుందని అభిమానుల్లో క్యూరియాసిటీ పెరిగింది.



# రణ్‌వీర్‌పై బ్యాన్.. కోర్టును ఆశ్రయించిన నిర్మాత


బాంబే సివిల్ కోర్టులో ప్రముఖ నిర్మాత టీపీ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్ బాలీవుడ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్‌పై (Ranveer Singh) 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్' విధించిన నాన్ కోఆపరేషన్ ఆదేశాలకు వ్యతిరేకంగా ఆయన ఈ న్యాయపోరాటానికి దిగారు. చలనచిత్ర పరిశ్రమకు చెందిన ఏ సభ్యుడి మీద నిషేధం విధించి ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఏ సంస్థకూ లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

దీనిపై టీపీ అగర్వాల్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో ఎవరి పైనా నిషేధాలు, ఆదేశాలు జారీ చేసే హక్కు ఎవరికీ లేదు. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ (FWICE) లాంటి సంస్థలకు ఇలా చేసే హక్కు అస్సలు లేదు. గతంలో నేను, దర్శకుడు విపుల్‌షా కలిసి ఇలాంటి ధోరణులకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశాం. సినిమా రంగం అనేది పరస్పర సహకారంతో నడిచే ఓ సృజనాత్మక వేదిక. ఇలాంటి సున్నితమైన విషయాలను చట్టపరమైన, వృత్తిపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలి. ఒక వ్యక్తితో ఎవరూ పనిచేయకూడదంటూ బలవంతం చేయడం, నిరుత్సాహపర్చడం లాంటి చర్యలను తేలికగా తీసుకోకూడదు. ఇలాంటి నిర్ణయాల వల్ల ఎంతోమంది జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, సృజనాత్మక స్వేచ్ఛకు విఘాతం కలుగుతుంది. అందుకే ఈ వ్యవహారాలను పారదర్శకంగా, చట్టబద్ధంగా పరిష్కరించాలి" అని అన్నారు.



టాలీవుడ్ హీరోయిన్లు సినిమా అవకాశాలు రాకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా వచ్చిన సబ్‌స్క్రిప్షన్ అనే ఆప్షన్‌ను వాడుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఈ పద్ధతిలో హీరోయిన్ల పర్సనల్ ఫోటోలు, వీడియోలు చూడాలంటే అభిమానులు ప్రతి నెల కొంత డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా నెలకు ఒక్కో ఫాలోవర్ నుండి రూ. 299 వసూలు చేస్తోంది. అలాగే రామ్ చరణ్ 'చిరుత' సినిమా హీరోయిన్ నేహా శర్మ కూడా ఇదే బాటలో నడుస్తూ డబ్బు సంపాదిస్తోంది. తాజాగా, మన తెలుగు బ్యూటీ ఈషా రెబ్బా కూడా ఇదే ట్రెండ్‌ను ఫాలో అవుతుండటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈషా రెబ్బా మిగతా హీరోయిన్ల కంటే ఒక అడుగు ముందుకు వేసి, తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు ఏకంగా రూ. 390 ఛార్జ్ చేస్తోంది. గత ఏడాది 'ఓంశాంతి శాంతి శాంతి' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈ అమ్మడికి, ప్రస్తుతం టాలీవుడ్‌లో పెద్దగా అవకాశాలు లేవు. అందుకే ఈమె ఈ సబ్‌స్క్రిప్షన్ దారి పట్టినట్లు తెలుస్తోంది. ఫాలోవర్స్ సంఖ్యను బట్టి చూస్తే ఈమెకు నెలకు కూర్చున్న చోటే భారీగా ఆదాయం వచ్చేలా ఉంది. కానీ, ఈషా రెబ్బా తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. కేవలం డబ్బుల కోసమే హీరోయిన్లు ఇలాంటి పద్ధతులు వాడుతూ దిగజారిపోవాలా? అంటూ నెట్టింట ఘాటుగా కామెంట్స్ చేస్తూ ఫైర్ అవుతున్నారు.

# అవకాశాలు లేకున్నా చేతినిండా సంపాదిస్తున్న ఈషా రెబ్బా..



# 'పెద్ది' సినిమాకి అసలు ట్రైలరే అక్కర్లేదు.. కంటెంట్ ఉన్నోడికి కట్ అవుట్ చాలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ – దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ వరుస ప్రమోషన్లతో హోరెత్తిస్తోంది. అయితే ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ గురించి సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తున్న వేళ, డైరెక్టర్ బుచ్చిబాబు చేసిన సంచలన కామెంట్స్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. అసలు పెద్ది సినిమాకు ట్రైలర్ అవసరం లేదంటూ ఆయన చేసిన బోల్డ్ కామెంట్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.

**ట్రైలర్లు చూసే సినిమాలకు వెళ్తున్నామా ఏంటి..**

సినిమా రిలీజ్ దగ్గరపడుతున్నా ఇప్పటివరకు అధికారిక ట్రైలర్ రాకపోవడంపై ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు బుచ్చిబాబు తనదైన శైలిలో స్పందించారు. "ఇంత బజ్ ఉన్న 'పెద్ది' సినిమాకి రిలీజ్ ట్రైలర్ అక్కర్లేదు.. అసలు ఈ సినిమాకి ట్రైలర్ కూడా అక్కర్లేదు. ఒకప్పుడు మనం అన్ని సినిమాలకీ ట్రైలర్లు చూసే థియేటర్లకు వెళ్లే వాళ్లమా ఏంటి? కథపై, కంటెంట్‌పై మాకు అంత నమ్మకం ఉంది" అని బుచ్చిబాబు కుండబద్దలు కొట్టారు. సినిమాపై ఉన్న విపరీతమైన హైప్ దృష్ట్యా కేవలం ప్రమోషనల్ కంటెంట్, సాంగ్స్ చాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లపైనే పూర్తి దృష్టి పెట్టడం కోసం బుచ్చిబాబు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. "నేను ప్రస్తుతం సోషల్ మీడియాలో లేను. నా ఫోన్ లో ఉన్న అన్ని సోషల్ మీడియా యాప్స్ డిలీట్ చేసేసాను" అని బుచ్చిబాబు షాకింగ్ నిజం చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, ట్రోల్స్ లేదా అనవసరమైన చర్చలకు దూరంగా ఉంటూ, కేవలం థియేటర్లలో ప్రేక్షకులకు బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ట్రైలర్ లేకుండానే సినిమాను థియేటర్లలోకి తెస్తున్నారంటే 'పెద్ది' అవుట్‌పుట్ ఏ రేంజ్‌లో వచ్చిందో అర్థం చేసుకోవచ్చని మెగా ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. మరి ట్రైలర్ లేకుండానే జూన్ 4న బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్న మెగా పవర్ స్టార్ 'పెద్ది' ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# నాని కొత్త సినిమా ప్రచారం.. నిజమే లేదట!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని కేవలం నటుడిగానే కాకుండా.. తన సొంత నిర్మాణ సంస్థ 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై వైవిధ్యమైన సినిమాలను నిర్మిస్తూ నిర్మాతగానూ టాలీవుడ్‌లో సరికొత్త మైలురాళ్లను అందుకుంటున్నారు. ఇటీవలే ఈ బ్యానర్ నుండి వచ్చిన 'కోర్టు' సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ సాధించడంతో, నాని తన ప్రొడక్షన్ హౌస్‌లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విపరీతంగా బజ్ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే, నాని లైనప్ మరియు వాల్ పోస్టర్ సినిమా రాబోయే చిత్రాల గురించి నెట్టింట ప్రచారంలో ఉన్న వార్తలపై నిర్మాణ సంస్థ స్పందిస్తూ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది.

ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్న సమాచారం ప్రకారం.. నాని ప్రస్తుతం నటుడిగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌తో ఫుల్ బిజీగా ఉన్నారని, ఈ చిత్రం ఆగస్టు విడుదలకు సిద్ధమవుతోందని ప్రచారం జరుగుతోంది. దీని తర్వాత రన్ రాజా రన్, సాహో ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమాను ఈ ఏడాది చివర్లో ప్రారంభించనున్నట్లు టాక్. ఇక నిర్మాతగా వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై మూడు ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వస్తున్నాయి. 'బ్యాండ్ మేళం' (హర్ష్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రలు) చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన సతీష్ జవ్వాజి చెప్పిన ఒక సరికొత్త ఐడియా నానికి నచ్చిందని, రీసెంట్‌గా ఫైనల్ స్క్రిప్ట్ లాక్ చేసి లీడ్ యాక్టర్ల కోసం అన్వేషణ మొదలుపెట్టారని ప్రచారం సాగుతోంది.



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in